# చక్రనేమి

గుమ్మా ప్రసాదరావు

**బూట్లకు కాళ్ళొస్తాయా? సాధారణంగా అయితే ఎవరైనా కాదనే అంటారు. కాని ఈ కథ చదివాక మాత్రం ఎవరైనా వస్తాయనే అంటారు. తమాషాగా ఉంది కదూ!**

కాళ్ళకు తొడుక్కునే బూట్లకి కూడా కాళ్ళొస్తాయని కల గంటామా!

ఆనందరావు విస్మయం చెందాడు, విచారించాడు. రెండు వందల పదిహేను రూపాయలు పెట్టి కొన్న బూట్లు పోయాయి. ఆనందరావుకి ఇంకా చిరాశ ఉంది. కుర్చీల కింద వెతికాడు.

దేవాలయాల్లో చెప్పులూ, జోళ్ళూ పోవడం పరిపాటే. పెళ్ళిళ్ళలోను తారుమారు అవడం కద్దు. కాని సినిమా హాలులో కూడా జోళ్ళ దొంగ లుంటారా? తన కా సంగతి తెలిసి ఉంటే బూట్లు విప్పేవాడే కాదు. కాళ్ళు నొప్పులు పెడుతూ ఉంటే ముందు సీటుమీద కాళ్ళు పెట్టుకుందుకు బూట్లు విప్పాడు. ముచ్చటపడి కొనుక్కున్న బూట్లు పోయాయి.

'ఉదయం లేస్తూనే ఎవరి ముఖం చూశానో!' అనుకున్నాడు. ఎవరి ముఖం? విమల ముఖమేగా!

"ఏడు గంట లవుతున్నా ఇంకా లేవరేం?" అంటూ కుదుపుతూ లేపింది విమల.

అప్పుడు ఆమె ముఖం తను చూశాడు. తలంటి స్నానం చేసింది. వదులుగా జడ వేసుకుని ఎర్ర గులాబి పువ్వు పెట్టుకుంది. కళ్ళకు కాటుక. నయాపైసా అంత కుంకుమబొట్టు. పాలపిట్ట రంగు సిల్కుచీర కట్టుకుంది. మందిరానికి వెళ్ళడానికి తయారైంది.

విమల ముఖం చూడడంవలన ఇలా జరిగిందా? ఉహు! కాదు. ముప్పై సంవత్సరాలుగా ఆమె ముఖం నిద్ర లేవగానే చూస్తున్నాడు. ఏనాడూ నష్టపోలేదు.

తనకూ, ఆ బూట్ల కీ ఋణం తీరిపోయింది. ఏ దరిద్రుడో కక్కుర్తిపడ్డాడు.

"బాబుగారూ! నిద్దరోతున్నారా? లేవండి. సినిమా అయిపోయి చాలాసేపైంది." స్వీపరు హాలు తుడుస్తూ అన్నాడు.

ఆనందరావు లేచాడు.

"బలేవారే! చెప్పు లొదిలేసి బోసి కాళ్ళతో వెళ్తారా? ఇంకా నిద్రమత్తు వదలలేదా?"

నయం! ఏవో చెప్పులు దొరికాయి. తొడుక్కున్నాడు. సరిగ్గా సరిపోయాయి.

** ** **

శేఖరం సినిమా హాలునుంచి బయటపడ్డాడు. అతని హృదయం ఆనందంతో పొంగిపోతున్నాది. ఠీవిగా, గర్వంగా నడుస్తున్నాడు. లేచిన వేళ మంచిది. ఎంత కాలంగా తను బూట్ల కోసం ప్రయత్నం చేస్తున్నాడు! ఎంత గొడవ చేసినా ఫలితం లేకపోయింది.

"నా చిన్నతనంలో కాలికి జోడు లేకుండానే బడికి వెళ్ళేవాడిని. ఈ పరీక్ష పాసై కాలేజీలో చేరితే, బూట్లు కొంటాను" అంటూ తండ్రి తన కోరిక తీర్చలేదు.

"బాబూ! నేనేం చెయ్యను? మీ నాన్నగారిది మొండి పట్టుదల. వారికి నేను నచ్చచెప్పలేను." తల్లి తన నిస్సహాయతను వ్యక్తం చేసింది.

తన భాగ్యంలో బూట్లు రాసి ఉన్నాయి. తను కావాలని దొంగతనం చేయలేదు. ఈ బూట్లే తన కాళ్ళను వెతుక్కుంటూ వచ్చాయి. సిరి రా మోకాలొడ్డే మూర్ఖు లుంటారా? తను మూర్ఖుడు కాదు. తీసి తొడిగి చూశాడు. సరిగ్గా సరిపోయాయి. సరి కొత్తవి. ఎవరికీ అనుమానం కలగదు.

ఆ సంతోషంతో సగంలోనే సినిమా హాలు నుంచి బయటపడ్డాడు.

పాపం! అత నెవరో! బూట్లు కనిపించక తిట్టుకుంటాడు కాబోలు! తిట్టుకోనీ - తనకేం? గట్టిగా తిడితే గాలికి, మెల్లిగా తిడితే మెడకు తగులుతాయి.

వేణుగోపాల స్వామి వారి ఆలయం దగ్గరకు రాగానే శేఖరం కాళ్ళకు బ్రేకులు పడ్డాయి.

తన కీ బూట్లు దొరకడం దైవేచ్ఛ కాక మరేమిటి? దేముడికి తన కృతజ్ఞతలు చెప్పడం తన విధి.

గాలిగోపురం దగ్గర తన బూట్లు విప్పి దైవ దర్శనానికి వెళ్ళాడు శేఖరం.

** ** **

ఆఫీసరు గదిలోంచి నయాపైసంత ముఖం చేసుకొని బయట కొచ్చాడు వరంధామయ్య.

తన సర్వీసంత వయస్సు లేదు. అయినా ఎన్ని మాట లన్నాడు! పనిలో తప్పు లుంటే ఎన్ని చీవాట్లు పెట్టినా తల వంచుకునేవాడు. తన ఆర్థిక పరిస్థితులు అతని కేం తెలుసు? కాకి పిల్ల కేం తెలుసు ఉండేలు దెబ్బ? మోసేవాడికి తెలుస్తుంది కావడి బరువు!

మంచి సూటు కుట్టించుకొని తొడుక్కోవాలని, బూట్లు వేసుకోవాలని తనకు మాత్రం ఉండదా? ఒక వంక ధరలు మండిపోతున్నాయి. వేరొక వంక పిల్లల చదువులు - పెళ్ళిళ్ళు. కరువులో అధికమాసం అన్నట్లు వచ్చే పోయే చుట్టాలు. కూన ఎదిగితే కుండ ఎదుగుతుం దంటారు. ఈ చాలీ చాలని జీతంతో ఏటికి ఎలా ఎదురీదుతున్నాడో తనకు తెలుసు కాని, అతని కేం తెలుసు?

బూట్లు వేసుకోనంత మాత్రాన, ఈ హవాయి



చెప్పులు వేసుకున్నంత మాత్రాన అతని పరువూ, ఆఫీసు పరువూ మంట గలుస్తున్నాయా? ఎన్నైనా అంటాడు - పడడానికి తన వంటి మెతక వా ళ్ళుంటే.

వరంధామయ్యకు ఆ రోజు పనిలో మనస్సు లగ్నం కాలేదు. రోజూలా రాత్రి ఎనిమిది గంటలవరకూ కూర్చోలేదు. ఆఫీసు టైం అవడానికి ఇంకా అరగంట ఉండగానే బయటపడ్డాడు.

ఇంటికి వెళ్ళబుద్ధి కాలేదు. కాస్త ఉపశమనం కలుగుతుందని గుడికి వెళ్ళాడు.

బయట చెప్పులు విప్పుతూ ఉంటే ఎన్నో జతల జోళ్ళు కనిపించాయి.

ఏ మనిషీ జన్మతః దొంగ కాడు. పరిస్థితులకు వశుడై దొంగతం చేస్తాడు. బెగ్, బారో, స్టీల్ అని ఊరికే అనలేదు. జోళ్ళు ఇవ్వమని ఎవరిని ముష్టి ఎత్తుకోలేడు. వాటిని అప్పుగా తీసుకోలేడు. మిగిలింది దొంగతనమే.

అది నీచాతినీచం. అపచారం! దేముడి సమక్షంలో దొంగతనమా?

వరంధామయ్య మనసు ఉయ్యాలలా ఊగిసలాడింది. ఈ నెలలోనే కాదు. అయిదారు నెలల లోపున తను బూట్లు కొనే స్థితిలో లేడు. పర్యవసానం ఊహా కందనిది కాదు. ఆఫీసరు రోజూ ఏదో ఒక మిషమీద తనను దుయ్యబడతాడు. తను సహించగలడా?

మరో మార్గం లేదు. దొంగతనమే కావచ్చు. తన ఉద్యోగానికీ, బూట్లకీ ముడిపడింది. తనకు బూట్లు కావాలి.

అంతరాత్మ వారిస్తున్నా అతను దొంగిలించడానికి సంసిద్ధు డయ్యాడు.

ఎన్నో జతల బూట్లు. అతని దృష్టి ఒక కొత్త జత బూట్లమీద పడింది. ఎనిమిదవ నంబరు. తనకు సరిగ్గా సరిపోతాయి.

** ** **

రామకృష్ణయ్యగారి , అబ్బాయి రాఘవరావు పెళ్ళికి బయలుదేరాడు ప్రకాశరావు. స్నేహితుడికి చదివించడానికి నూరు రూపాయలు పెట్టి మంచి ఉపహారం కొన్నాడు. ప్రకాశరావుకి డబ్బుకి కొదువ లేదు. అతని తండ్రి రెండు చేతులా ఆర్జిస్తున్నాడు.

అయితే ప్రకాశరావులో ఒక పాడు అలవాటు ఉంది. కాఫీ హొటలుకి వెళ్తే కనీసం ఒక చెంచానైనా ఉడాయిస్తాడు. రైలు ప్రయాణంలో ప్లాట్‌ఫారం మీద కాఫీ తాగి ఆ కప్పూ, ప్లేట్లను తన స్వంతం చేసుకుంటాడు. స్కూల్లో మిత్రుల పుస్తకాలనో, లేదా ఇతర పరికరాలనో అపహరిస్తాడు. కూరల బజారుకి వెళ్తే చాకచక్యంతో కొన్ని కూరలను తన సంచిలో వేసుకుంటాడు.

అయితే దొంగతనం చేసే అవసరం అతనికి లేదు. అ దొక చిలిపితనం. తను ఆ పనిని సమర్థించుకుంటాడు. వీళ్ళు న్యాయంగా ఆర్జిస్తున్నారా? ప్రజలను దోచుకోవడం లేదూ?

పెళ్ళి వా రింట్లో హడావిడిగా ఉంది. రామకృష్ణయ్యగారు, అతని వియ్యంకుడు మంచి పరపతి గల వ్యక్తులు. చాలామంది వచ్చారు

ఆర్థిక వనరుల కోసం కటకటగా ఉన్న రోజు లివి. కొత్త పన్నులకి చిట్కా ఏమైనా తోస్తే బాగుండు ననిపిస్తూ ఉంటుంది. అటువంటప్పుడు తూర్పు తిమోర్ దీవి [ఇండోనీషియా] శాసనసభ్యు డొకడి బుర్రలో మెరిసిన ఆలోచన చూడండి. వేశ్యా వృత్తి సమాజాన్ని కలుషితం చేస్తుంది. కాబట్టి సమాజానికి పరిహారంగా ఇక నుంచి అక్కడి అంగడి బొమ్మలు నెలకు రెండు వేల రూపాయలు కాలుష్య శుల్కం చెల్లించాలని ఆయన సూచన. ఐడియా గొప్పగా ఉంది కదూ?

పెళ్ళికి. మైకులో సినిమా సంగీతం మధురంగా వినిపిస్తున్నది.

కొంతసేపు వాళ్ళతోనూ, వీళ్ళతోనూ పిచ్చాపాటీ మాట్లాడాడు. పెళ్ళికుమారుడితో కరచాలనం చేసి, తను తెచ్చిన ప్రెజెంటేషను ఇచ్చాడు. నలుగురితో పాటు పంక్తి భోజనం చేశాడు.

అయినా అతనికి వెలితిగా ఉంది. అటూ ఇటూ చూశాడు. అందరూ పాదరక్షలు విడిచిన ప్రదేశం దగ్గర ఆగాడు. తన చెప్పులకు మారుగా తనకు సరిపోయిన బూట్లు తొడుక్కొని, ఉషారుగా ఈల వేస్తూ బయట పడ్డాడు.

** ** **

రాత్రి ఎనిమిది గంటలైంది. ఆ రోజు ప్రకాశరావు తన మిత్రుడు శేఖరాన్ని కలవలేదు. వాడు పెళ్ళికి కూడా వచ్చినట్లు లేదు. కారణం తెలుసుకోవాలని, శేఖరం ఇంటికి వెళ్ళాడు. బజ్జరు నొక్కాడు.

వరంధామయ్య తలుపు తీసి - "నీవా ప్రకాశం! శేఖరం ఏడీ?" అని అడిగాడు.

"శేఖరం ఇంట్లో లేడా? వాడికోసమే నేను వచ్చాను". అన్నాడు ప్రకాశరావు.

వరంధామయ్య దృష్టి ప్రకాశం వేసుకున్న బూట్ల వంక మళ్ళింది.

ఆ బూట్లు చూడగానే అతనికి పోయిన తన బూట్లు గుర్తుకొచ్చాయి. అయినా ప్రకాశం దొంగిలించి ఉంటాడని అతను శంకించలేకపోయాడు. అతనికేం కర్మ దొంగిలించడానికి!

"ఏమిటి మామయ్యా! అలా చూస్తున్నారు?" అన్నాడు ప్రకాశరావు.

"ఏం లేదు బాబూ! నా బూట్లూ ఇలాంటివే. ఎవరో కాజేశారు" అన్నాడు దీనంగా.

"మీ బూట్లు పోయాయా? ఎక్కడ?"

"ఏం చెప్పను బాబూ? దేనికైనా పెట్టి పుట్టాలి" అన్నాడు.

ప్రకాశరావు అతని కాలి కున్న చెప్పులు చూశాడు. అవి తను రామకృష్ణయ్యగారి అబ్బాయి పెళ్ళి జరుగుతున్న చోట విడిచిన తన చెప్పులు. అంటే తను వరంధామయ్యగారి జోళ్ళు సంగ్రహించాడా? తెలియక ఎంత పొరపాటు చేశాడు!

"మీరు రాఘవరావు పెళ్ళికి వెళ్ళారా? మీ బూట్లు అక్కడే పోయాయా?"

"నీకు జ్యోతిషం వచ్చా? ఔను బాబూ! అక్కడే పోయాయి."

"ఇంకేం ఇవి మీవే. నేను సరదాగా దొంగిలించాను. ఇవి మీవని నాకు తెలియదు." బూట్లు విప్పి అతని కిచ్చాడు.

వరంధామయ్య సంతోషంగా వాటిని ధరించి - "బాబూ! ఎంత మంచి మాట చెప్పావు! ఇలా పోయినవి దొరుకుతాయని నేను కలలో కూడా ఊహించలేదు" అన్నాడు.

"ఏమిటి మామయ్యా! కలలో కూడా ఊహించలేదు అంటున్నావు?" అన్నాడు అప్పుడే అక్కడకు వచ్చిన శేఖరం.

అయితే అతను జవాబు చెప్పకముందే శేఖరం మామయ్య పాదాల వంక చూశాడు - "మామయ్యా! ఈ బూట్లు ఎప్పుడు కొన్నావు - ఎంతకు కొన్నావు?" అన్నాడు.

ఎప్పుడు కొన్నాడు - ఎంతకు కొన్నాడు? ఏమని జవాబు చెప్తాడు?

"అచ్చం ఇలాంటి బూట్లే నావీ. ఈ రోజు సాయంత్రం మందిరంలో ఎవరో దొంగలించారు" అన్నాడు శేఖరం.

"బాగుంది. నీ బూట్లూ పోయాయా? నయం మందిరంలో అన్నావు" అన్నాడు ప్రకాశరావు.

వరంధామయ్యకు శేఖరాన్ని చూస్తే జాలి వేసింది. మందిరంలో అంటున్నాడు. బహుశా తను వాడి బూట్లే కొట్టేసి ఉంటాడు. బహుశా ఏమిటి? వాడి కాళ్ళకు తన హవాయి చెప్పు లున్నాయి.

"ఒరేయ్ శేఖరం! నన్ను క్షమించరా! ఏదో బుద్ధి గడ్డి తిని నేను వేణుగోపాల స్వామి గుడి బయట వీటిని కాజేశాను. అంతరాత్మ అడ్డు చెప్పినా, అప్పుడు నా పరిస్థితి అలాంటిది. ఏమైతేనేం ఇప్పుడు హృదయం తేలికపడింది. నా చెప్పులు నా కిచ్చేసి, నీ జోళ్ళు నువ్వు తీసుకో!" అన్నాడు వరంధామయ్య.

అప్పుడే ఆనందరావు అక్కడ కొచ్చాడు - "ఏమిటి మీరు ముగ్గురూ ఇక్కడ గుస గుస లాడుతున్నారు? లోపలకు పదండి" అన్నాడు.

శేఖరం విప్పిన బూట్లు చూసి - "బాబూ! ఈ బూట్లు ఎక్కడివి? ఎప్పుడు కొన్నావు?"

శేఖరం ముఖంలో కత్తి వేటుకి నెత్తురు చుక్క లేదు. తండ్రితో అబద్ధం ఎలా చెప్పగలడు?

"నీవు బూట్లు కొనమని చాలామార్లు అడిగినా నీకు కొనకుండా నేను కొనుక్కున్నందుకు నా మంచి శాస్తే జరిగింది. నా బూట్లు ఎవరో సినిమా హాల్లో కొట్టేశారు."

"నాన్నా! మినర్వాలోనా?"

"ఔను!"

"బాల్కనీలో కదూ?"

"ఔను!"

"అయితే ఇవి మీవే. నేను కొనలేదు. బహుశా ముందు వరసలో మీ రుండి ఉంటారు. ఈ బూట్లు నా కాళ్ళ దగ్గరకు వచ్చాయి. ముద్దుగా ఉంటే తొడుక్కోవా లనిపించింది. తీరా తొడిగిన తరువాత విప్పడానికి మనస్కరించలేదు."

"బాగుంది. ఈ జోళ్ళు నాలుగు గంటల్లో నాలుగు మజిలీలు చేసి, నలుగురి కాళ్ళు మారి, చివరకు యజమానిని చేరుకున్నాయి" అన్నాడు ప్రకాశరావు నవ్వుతూ. ★